క్లుప్తంగా

సచివాలయం తనిఖీ

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ వెంకట నాయుడు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులతో పాటు సచివాలయ సిబ్బంది, వలంటీర్ల హాజరు శాతాన్ని పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మంజుల, ఏఎస్ఎం నాగమణి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అంజన్నకు అభిషేకం



అలంకరణలో అంజన్న

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు అంజన్నకు శనివారం అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలకరించారు. ప్రధాన అర్చకుడు అనీల్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముమ్మరంగా ఓటరు స్లిప్పుల పంపిణీ



ఓటరు స్లిప్పులను అందజేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు స్లిప్పుల పంపిణీ ముమ్మరంగా కొనసాగుతోంది. రెండు రోజుల్లోపు స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలివ్వడంతో రెవెన్యూ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఓటర్లుకు అందజేస్తున్నారు. కాగా కళ్యాణదుర్గం డివిజన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రుల ఓట్లు 13,215 ఉండగా, ఉపాధ్యాయ ఓట్లు 756 ఉన్నాయి.

రాష్ట్ర స్థాయి విజేతలకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

కళ్యాణదుర్గం: విజయనగరంలోని ఎంఎస్ ప్రభుత్వ సంస్కృత డిగ్రీ కళాశాలలో ఈనెల 3న 'ఇన్నోవేషన్ – డిజైన్, గ్లోబల్ థింకింగ్' అనే అంశం పై పోడో కాస్ట్, చాట్ జీపీటీ వేదికగా రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. పోటీల్లో కళ్యాణదుర్గం ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటారు. విద్యార్థినులను శనివారం అధ్యాపకులు అభినందించారు. కళాశాలకు చెందిన విద్యార్థిని సౌమ్య (ఫస్ట్ బీ.కాం), జాహ్నవి (ఫస్ట్.జువాలజీ) రాష్ట్ర స్థాయి తృతీయ బహుమతులతో పాటు కన్సొలేషన్ బహుమతులు గెలుచుకున్నారు. వారికి రూ. వెయ్యి నగదుతో పాటు, జ్ఞాపిక అందించారు. ప్రతిభ చాటిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ డాక్టర్ జయరామిరెడ్డి, అధ్యాపకులు జీఎల్ఎన్ ప్రసాద్, కాంతారావు అభినందించారు.

వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా అందించాలి



మూలగిరిపల్లిలో రికార్డులను తనిఖీ చేస్తున్న డబ్ల్యూహెచ్ఓ ప్రతినిధి శ్రీనివాసులు

ఉరవకొండ: వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా అందించాలని ఆరోగ్య సంస్థ ప్రతినిధి(డబ్ల్యూహెచ్ఓ) శ్రీనివాసులు సూచించారు. మండలంలోని రాకెట్ల పీహెచ్‌సీ పరిధిలోని మూలగిరిపల్లి, రాకెట్ల తండా గ్రామాల్లో చేపట్టిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. వ్యాక్సిన్‌లను సరైన ఉష్ణోగ్రతల వద్ద నిల్వ చేస్తున్నారా, రికార్డులు సరిగా నిర్వహిస్తున్నారా? అని ఆరా తీశారు. ఆర్‌సీహెచ్, ఎంసీహెచ్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ అప్పుడే పుట్టిన శిశువు నుంచి గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా అందించే బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నాగరంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్ మూర్తి పాల్గొన్నారు.

భూమికి పచ్చాని రంగేసినట్లు!



వరి పంటలో శత్రు పురుగులను తింటున్న కొంగలు



కళకళలాడుతున్న మొక్కజొన్న పంట

గుమ్మఘట్ట: గతంలో బీళ్లుగా దర్శనమిచ్చిన భూములు నేడు పచ్చని పంటలతో కళకళలాడుతున్నాయి. కంపచెట్లు పెరిగి సాగుకు పనికారాకుండా పోయిన భూములను రైతులు చదును చేసి వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలను సాగు చేశారు. భైరవానితిప్ప ప్రాజెక్టు పరిధిలోని కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని బ్రహ్మసముద్రం మండలం, రాయదుర్గం నియోజకవర్గంలోని గుమ్మఘట్ట మండలాలకు వరప్రదాయనిగా ఉన్న రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండడంతో కుడి కాలువ కింద 5,430 ఎకరాలు, ఎడమ కాలువ కింద 1,960 ఎకరాల ఆయకట్టుకు గత ఏడాది డిసెంబర్ 25న సాగు నీటిని జలవనరుల శాఖ అధికారులు విడుదల చేశారు. వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలు రైతులు సాగు చేవారు. పంటలకు రసాయనిక ఎరువులు చల్లడం, క్రిమిసంహారక మందులు పిచికారీ చేయడం, కలుపు తొలగించడం తదితర పనులు చేస్తూ రైతులు బిజీగా ఉన్నారు.

దేశమే ఏపీ వైపు చూసేలా 'జగన్' పాలన



మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: దేశమే ఏపీ వైపు చూసేలా సీఎం జగన్ ఆదర్శవంతమైన పాలన సాగిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డులో శనివారం వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా, గ్రీవెన్స్, చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు గౌని కాంతారెడ్డి, చంచుల నాగప్ప, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇల్లూరి శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, పట్టణ కన్వీనర్ ముస్తాక్‌తో కలసి ఆయన ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. విప్ మాట్లాడుతూ అనుభవం పేరుతో చంద్రబాబు అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని దివాళా తీశాడన్నారు. జన్మభూమి కమిటీలు పెట్టి సర్వం దోచేసి పేదల నోట్లో మట్టికొట్టారన్నారు. విశాఖ వేదికగా నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు అనూహ్య స్పందన రావడం, ప్రపంచ దిగ్గజ ప్రతినిధుల నోట సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రశంసించడం చూసి దుష్ట చతుష్టయం ఓర్వలేక పోతుందన్నారు. రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డిని విజయానికి మనమంతా శక్తి వంచన లేకుండా కృషి చేద్దామన్నారు. అనంతరం కరపత్రాలు అందజేసి ఓటు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, పార్టీ ఇన్‌చార్జులు, వివిధ మండలాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యం

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ బలపరిచిన పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ల డైరెక్టర్లు కోరారు. శనివారం పట్టణంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి తరపున విస్తృతంగా పట్టణంలో ప్రచారం చేపట్టారు. ఎంపీపీ చందా చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, సచివాలయాల కన్వీనర్ ఆసీఫ్, పార్టీ పట్టణ కన్వీనర్ బ్యాంకు ఓబులేసులు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిను గెలిపించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికు కానుకగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో వాణి విద్యాసంస్థల ప్రతినిధి టి.రఘురాములు, వార్డు సభ్యుడు వశికేరిమల్లి, ఎంపీటీసీ ప్రసాద్, టౌన్‌బ్యాంకు డైరెక్టర్ ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి ప్రథమ ప్రాధాన్యత ఓటువేసి గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ప్రచారం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్ అర్చన , రూరల్ కన్వీనర్ ఆంజనేయులు, మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ బిక్కి నాగలక్ష్మి, వక్ఫ్ బోర్డు సభ్యుడు షేక్షావలి, మండల మాజీ కన్వీనర్ తిరుమల వెంకటేష్, నాయకులు సుధాకర్‌రెడ్డి, బిక్కిహరి , తదితరులు ప్రచారం పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సర్పంచ్ కోట్ల ఉమేష్ కోరారు. మండలంలోని బేలోడు గ్రామంలో ప్రభుత్వ పాఠశాల, గ్రామ సచివాలయంతో పాటు పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ప్రచారం చేశారు. నాయకులు జయరాం రెడ్డి, బేలోడు రామాంజనేయులు, వైస్ సర్పంచ్ రామాంజనేయులు, ఖాసీం పాల్గొన్నారు.

శెట్టూరు: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ సోమనాథరెడ్డి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ తీన్మార్ తిమ్మరాజు కోరారు. శనివారం మండలంలోని శెట్టూరు, కైరేవు, బచ్చేహళ్ళి, చిన్నంపల్లి, చెర్లోపల్లి, కనుకూరు, ముకలేకడు, అయ్యగార్లపల్లి, లక్ష్మంపల్లి, పెరగుపాళ్యం, తిప్పనపల్లి, యాటకల్లు, ఐదుకల్లు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కల్చరల్ విభాగం అధ్యక్షుడు సోమశేఖర్, సింగిల్ విండో మెంబర్ గొర్ల గంగాధర్, సర్పంచ్‌లు ప్రాకాష్, గంగన్న, నాగరాజు, వెంకటేశులు, ఈరన్న, విరుపాక్షి, విరుపాక్షి గౌడ్, వన్నూరుస్వామి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విడపనకల్లు: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మీ ప్రథమ ఓటేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రులను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసన్న , ఎంపీపీ కరణం పుష్పావతి, జేసీఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, జెడ్పీటీసీ హనుమంతు అభ్యర్థించారు. శనివారం మండలంలోని పాల్తూరు, చీకలగురికి, ఉండబండ, కరకముక్కల, హావళిగి,వి.కొత్తకోట గ్రామాల్లో వారు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కరణం భీంరెడ్డి, రఘురాం, రామాంజనరెడ్డి, శివ పాటిల్, సింగాడీ రాజశఖర్, దాసరి వెంకటేశులు, బోయ శ్రీరాములు పాల్గొన్నారు.

కనుల పండువగా లక్ష్మీనృసింహుడి ఉత్సవం



స్వామి ఎదుట పొర్లు దండాలు పెడుతున్న భక్తులు

బొమ్మనహాళ్: మండలంలోని ఉప్పరహాళ్ గ్రామంలో లక్ష్మీనృసింహస్వామి ఉత్సవం వేలాది మంది భక్తుల మధ్య శనివారం వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తుల మధ్య స్వామి ఉత్సవం కమనీయంగా సాగింది. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 10 గంటలకు స్వామిని ఊరేగింపుగా ఉద్దేహాళ్ గ్రామ సమీపంలోని వేదావతి హగరికి తీసుకువచ్చి జలాభిషేకం చేయించి ప్రత్యేక అలంకరణతో నది ఒడ్డున కూర్చోబెట్టారు. సాయంత్రం వరకూ వివిధ గ్రామాల నుంచి వచ్చి వేలాది మంది భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే భక్తులు పొర్లు దండాలు పెట్టారు. సాయంత్రం ఉప్పరహాళ్ గ్రామంలో లక్ష్మీనరసింహ స్వామిని ఊరేగింపు నిర్వహించారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి తదితరులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆయన అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఎస్ఐ శివ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ భోజరాజు నాయక్, జెడ్పీటీసీ సభ్యుడు నాగిరెడ్డి, మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ముల్లంగి నారాయణస్వామి, మాధవ్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి, యోగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహర్షి వాల్మీకి జీవితం ఆదర్శప్రాయం



వాల్మీకి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

బొమ్మనహాళ్: కృషి ఉంటే మనుషులు రుషులవుతారని చాటిచెప్పిన ఆదర్శప్రాయుడు వాల్మీకి మహర్షి అని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని కురువల్లి లో శనివారం వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని వాల్మీకి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ లిఖిత హాజరయ్యారు. వాల్మీకి మహర్షి విగ్రహానికి వారు ఆలయంలో, హోమ గుండం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విప్ మాట్లాడుతూ వాల్మీకి రామాయణాన్ని మించిన వ్యక్తిత్వ వికాస పుస్తకం మరొకటి లేదన్నారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరాంజినేయులు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఉపేంద్రరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవ్‌రెడ్డి, మండల కన్వీనర్లు ఈశ్వరరెడ్డి, వన్నూరుస్వామి, వైస్ ఎంపీపీ రమేష్, సర్పంచ్ జయరామ్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకటేశులు, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, లోకేష్, ముల్లంగి నారాయణస్వామి, పరమేశ్వర, రాళ్ల తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి డి.హీరేహాళ్ వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వన్నూరుస్వామి రూ.10,200 నగదు ఇచ్చినట్లు వాల్మీకి సేవాసమితి నాయకులు తెలిపారు. అలాగే మండలంలోని శ్రీరంగాపురం క్యాంపు గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన అన్నపూర్ణ రైస్ మిల్‌ను శనివారం ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి ప్రారంభించారు.

పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



రాత్రి 8 గంటల సమయంలో నీలివేణితో జవాబులు రాబడుతున్న డీఈఓ సాయిరాం

కూడేరు: పదోతరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యమని జిల్లా విద్యాధికారి సాయిరాం అన్నారు. శనివారం రాత్రి ఆయన మండల కేంద్రం కూడేరులో పదో తరగతి విద్యార్థులు నీలివేణి, దాదా వలి ఇళ్లకు వెళ్లారు. పిల్లలు చదువుకుంటున్నారా? టీవీలు చూస్తున్నారా? అని పిల్లల తల్లిదండ్రులతో ఆరా తీశారు. పాఠశాలలో విద్యాబోధన బాగా చేస్తున్నారా? స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారా?అని ఆరా తీశారు. వర్క్ బుక్, నోట్ బుక్స్‌ను పరిశీలించగా అందులో హెచ్ఎం, టీచర్లు సరి చూసినట్లు సంతకాలు లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న హెచ్ఎం, టీచర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్షలంటే భయాందోళన వీడాలని సూచించారు. టీవీ,సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ రాత్రి 10 గంటల వరకూ, వేకువజామున 4 గంటల నుంచి చదవాలని సూచించారు. అంతకుముందు కమ్మూరు పాఠశాల, కేజీబీవీని సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా చదివించి ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ఉపాధ్యాయులకు ఆయన ఆదేశించారు. ఆయన వెంట ఎంఈఓ చంద్రశేఖర్, ఏఎంఓ హరికృష్ణ, ఏపీఓ నారాయణస్వామి ఉన్నారు.

ఇంగ్లిష్ ఫెస్టివల్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

కంబదూరు: శెట్టూరు మండలంలోని కనుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఇంగ్లిష్ ఫెస్టివల్‌లో కంబదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సెల్‌ఫోన్ దుర్వినియోగం, ప్రేమ పేరుతో మోసపోయి ఆత్మహత్యలు చేసుకోవడం వంటి వాటి మీద ఉపాధ్యాయుడు సూర్యనారాయణ రచించిన స్కిట్‌ను విద్యార్థులు అద్భుతంగా ప్రదర్శించి మొదటి స్థానాన్ని సాధించారు. ఉత్తమ ప్రదర్శనను కనబరచిన విద్యార్థులను శనివారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణనాయక్,ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే ఉపాధ్యాయుడు సూర్యనారాయణ రూ.1,000 విలువ చేసే పుస్తకాలను అందజేశాడు.

8న మెగా వైద్య శిబిరం

ఉరవకొండ: స్థానిక కణేకల్లు రోడ్డు వద్ద ఉన్న శ్రీవాణి విద్యానికేతన్ స్కూల్ ఆవరణలో ఈనెల 8న మాజీ ఎమ్మెల్యే వశికేరి గోపీనాథ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత కంటి, గుండె ఆపరేషన్లు, మోకాలు, భుజము, సమస్యలకు శస్త్ర చికిత్స మెగా వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, చారిటబుల్ ట్రస్టు వైస్ చైర్మన్ వశికేరి మల్లికార్జున కోరారు. శనివారం మెగా వైద్య శిబిరానికి చెందిన కరపత్రాలను ఎంపీపీ చందాచంద్రమ్మ, వైఎ ఎంపీపీ నరసింహులు, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, సచివాలయ కన్వీనర్ ఆసీఫ్, పార్టీ పట్టణ కన్వీనర్ బ్యాంకు ఓబులేసు తదితరులు విడుదల చేశారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు

కూడేరు: మండల కేంద్రంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అరుణకుమార్ అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అందించిన వివరాలు మేరకు .. బాలుడు ద్విచక్రవాహనంలో బస్టాండ్ వైపు వస్తూ ముందు ఉన్న ఆటోను అదుపు తప్పి ఢీకొట్టాడు. గాయపడిన బాలుడిని 108లో అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు.

మొక్కజొన్న పంటకు నిప్పు

బ్రహ్మసముద్రం: మండలంలోని పడమటి కోడిపల్లికి చెందిన రైతు ఎర్రిస్వామి రెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంట సాగు చేశాడు. శనివారం గుర్తు తెలియని వ్యక్తులు మొక్కజొన్న పంటకు నిప్పు పెట్టారు. దీంతో దాదాపు ఎకరం మొక్కజొన్న పంట కాలి బూడిదయ్యింది. రూ.50 వేలకు పైగా నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. రెవెన్యూ సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు. న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

మద్యం ప్యాకెట్ల పట్టివేత

రాయదుర్గం: రాయదుర్గం సెబ్ పోలీసులు సరిహద్దు ప్రాంతాల్లో విస్తత దాడులు నిర్వహించారు. నూతనంగా విధుల్లో చేరిన సీఐ జయనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం వేకువజామున పోలీసులు పహారా కాచి కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నారు. సీఐ విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. 170 కర్ణాటక టెట్రా పాకెట్లతో నలుగురు వ్యక్తులు, రెండు ద్విచక్ర వాహనాలు పట్టుబడ్డాయని వివరించారు. వాటిని సీజ్ చేసి నిందితులను కోర్టులో హాజరు పరిచామన్నారు. మద్యం, ఇసుక అక్రమ రావాణాపై ఉక్కుపాదం మోపుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

కూడేరు: జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ హనుమప్ప సూచించారు. శనివారం ఆయన మండలంలోని అరవకూరు జగనన్న లే-అవుట్‌ను సందర్శించారు. ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకుని సొంతింటి కలను సాకారం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణ దశలను బట్టి వెంటనే బిల్లులు మంజూరు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. అర్హత ఉండీ ఇల్లు మంజూరు కాని పేదలు వెంటనే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ముస్తఫా కమల్‌బాషా, హౌసింగ్ ఏఈ శేఖర్, పీఆర్ ఏఈ శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై కళాజాతా

బెళుగుప్ప: మండలంలోని తగ్గుపర్తి గ్రామంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణబ్యాంకు వద్ద శనివారం నాబార్డ్ సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాతా బృందం ప్రజలకు అవగాహన కల్పించారు. బ్యాంకు పథకాలు, స్కీంలు, జీవిత బీమా, ప్రమాద బీమా పథకాలు, రుణాల మంజూరు అంశాలను కళాజాతా బృందం ఆర్గనైజర్ చిరంజీవి తన సిబ్బందితో కలసి వివరించారు. కార్యక్రమంలో ఏపీజీబీ తగ్గుపర్తి మేనేజర్ సురేష్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ శివకుమార్, క్యాషియర్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ నిష్పక్షపాతంగా చేపట్టండి

బెళుగుప్ప: 2022–23 వార్షిక సంవత్సరంలో చేపట్టిన అభివృద్ధి పనులపై నిష్పక్షపాతంగా సామాజిక తనిఖీ చేపట్టాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ కృష్ణమూర్తి సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ స్టేట్ రిసోర్స్ పర్సన్ తులసీనాయక్, పంచాయతీరాజ్ జేఈ సుదాకర్‌తో కలసి డీఆర్‌పీలు, ఎన్ఆర్ఈజీఎస్ క్షేత్రస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలంలోని 29 గ్రామాలకు సంబంధించి సామాజిక తనిఖీ కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

జొన్నలు మద్దతు ధరకు విక్రయించండి

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు గ్రామంలో జొన్న రైతులను అధికారులు కలసి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు విక్రయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం జొన్న రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా క్వింటాల్‌కు రూ.2999 మద్దతు ధర ప్రకటించిందన్నారు. జొన్న సాగు చేసిన రైతులు నేరుగా ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం ఆర్‌బీకేలో రైతులతో సమావేశమై ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల సంస్థ డీఎం నీలమయ్య, తహసీల్దారు బ్రహ్మయ్య, ఏఓ పెన్నయ్య, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్, ఫ్యాన్ సౌకర్యం కల్పించండి

కూడేరు: పోలింగ్ కేంద్రాల్లో తప్పని సరిగా విద్యుత్, ఫ్యాన్ సౌకర్యాన్ని కల్పించాలని హెచ్ఎం శ్రీనివాస ప్రసాద్‌కు, సిబ్బందికి ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా సూచించారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఓటర్లకు తాగునీరు, మరుగుదొడ్ల వసతి ఉండేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. దివ్యాంగులు గదిలోకి వెళ్లడానికి ర్యాంపు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా పట్టుభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మొత్తం ఓటర్లు 848 మంది ఉన్నారన్నారు. ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేయిస్తున్నామన్నారు.

ఆరోపణల్లో వాస్తవం లేదు

వజ్రకరూరు: పింఛన్ పంపిణీ సమయంలో ఇంటి పన్నును మినహాయించి మిగిలిన సొమ్ము పింఛన్‌దారులకు అందచేస్తున్నారని వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు గ్రామ సచివాలయ కన్వీనర్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శి కె.పార్వతి, వలంటీర్లు అన్నారు. శనివారం గడేహోతురు గ్రామంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి పింఛన్ సొమ్మును పూర్తిగా అందజేశామన్నారు. ఇంటిపన్ను చెల్లించాలని పింఛన్‌దారులపై ఎలాంటి ఒత్తిడి తీసుకురాలేదన్నారు. ఎల్లో మీడియాలో అవాస్తవాలు రాయిస్తూ గ్రామ వలంటీర్ వ్యవస్థను అభాసుపాలు చేయడానికి టీడీపీ నాయకులు కుట్ర చేస్తున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న జనాదరణను టీడీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పరమేష్, వలంటీర్లు పాల్గొన్నారు.

6న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 6న అరుణాచలానికి ప్రత్యేక సర్వీసు నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం రామచంద్ర తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మహా పుణ్యక్షేత్రమైన అరుణాల క్షేత్రానికి అరుణగిరి ప్రదిక్షణకు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక సర్వీసు (94439) నడుపుతున్నామన్నారు. 6వ తేదీ సాయంత్రం కళ్యాణదుర్గం డిపో నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. భక్తులు రాను పోనూ చార్జీలకు రూ.1,790 చెల్లించాలన్నారు. వివరాలకు 9704487600 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పంట రుణాలు రెన్యూవల్ చేసుకోండి

బ్రహ్మసముద్రం: భైరవానితిప్ప సహకార సంఘం పరిధిలో పంట రుణాలు తీసుకున్న రైతులు ఈ నెల 15 లోగా వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని ఆ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, సిబ్బంది శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే సహకార సంఘంలో సభ్యత్వం, ఓటుహక్కు కలిగిన రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

ఘనంగా పల్లకీ సేవ

ఉరవకొండ రూరల్: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ఈఓ కె. విజయ్ కుమార్, అర్చకుడు గుండుస్వామి ఆధ్వర్యంలో పల్లకీ సేవా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి మేళతాళాలతో ఆలయం చుట్టూ ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో ఆదర్శంగా నిలవాలి

కుందుర్పి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మిస్సెస్ ఇండియా టైటిల్ విజేత డాక్టర్ సుప్రజ, చిన్న పిల్లల వైద్యురాలు డాక్టర్ హేమలత సూచించారు. శనివారం వారు కుందుర్పిలోని ఎస్‌కే చారిటబుల్ ట్రస్ట్, అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని వారు సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందని, బాలికల విద్యకు ప్రాధ్యాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వం అందించే రుణాలతో మహిళలు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్కే చారిటబుల్‌ట్రస్ట్ నిర్వాహకులు లెనిన్ బాబు, టి రాజు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ దిలీప్‌కుమార్, ట్రస్ట్ సభ్యులు యశోదమ్మ, సావిత్రమ్మ, ఉమాదేవి, శ్రీకాంత్, వివిధ గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణకు టీకాలు

వజ్రకరూరు: మండలంలోని వజ్రకరూరు, కొనకొండ్ల గ్రామాల్లో శనివారం పశువులకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. పశువైద్యశాఖ ఏడీ రంగస్వామి హాజరై టీకాల కార్యక్రమం ప్రారంభించారు.అ పశువైద్యాధికారి క్రిష్ణమూర్తినాయక్, ఏహెచ్ఓ స్వర్ణలత, ఓఎస్ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యత కొరవడితే చర్యలు



మోడల్ స్కూల్‌లో భోజన నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న జడ్జి లావణ్య

రాయదుర్గం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత కొరవడితే కఠిన చర్యలు తప్పవని రాయదుర్గం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎన్. లావణ్య హెచ్చరించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ విషయంలో రాజీపడేది లేదన్నారు. శనివారం పట్టణంలోని మోడల్ స్కూల్‌ను జడ్జి ఆకస్మికంగా పరిశీలించి మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేశారు. భోజనం రుచి చూసి శుచి, శుభ్రతపై అసహనం వ్యక్తం చేశారు. వంటగది, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం జడ్జి మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతగా భోజనం అందజేయాలన్నారు. విద్యాశాఖ అధికారులు కూడా తనిఖీలు నిర్వహించి భోజనం నాణ్యతగా ఉండేలా చూడాలని ఆదేశించారు. పట్టణంలో ఇప్పటికే బీజీ తిలక్, కస్తూర్బా గురుకుల బాలికల పాఠశాల, ఎస్సీ బాలికల హాస్టల్ ను తనిఖీలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.